సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 6 । జనవరి । 2023



ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

ములకలచెరువు మండలంలో డ్రాగన్‌ఫ్రూట్ పంటను ప్రయోగాత్మకంగా పండించి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. - 8లో



విద్యార్థులకు అర్థమయ్యేలా వీడియో పాఠాలు

విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా వీడియో పాఠాలు రూపొందించాలని వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.70	రూ.108



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 185 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	620	647
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 224.06 కిలోలు



నర్సరీలో సిద్ధంగా ఉన్న బొప్పాయి మొలకలు

బొప్పాయిపై బోలెడు ఆశలు

- బొప్పాయి సాగుపై రైతుల ఆసక్తి
- జిల్లా వ్యాప్తంగా 6500 ఎకరాల సాగుకు సమాయత్తం
- ముందస్తుగా నర్సరీ యజమానులకు అధికారుల అవగాహన

రైల్వేకోడూరు అర్బన్: గత రెండేళ్లుగా నష్టాలు చవి చూసిన ఉద్యాన రైతులు ఈ ఏడాది కోటి ఆశలతో బొప్పాయి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఈ నెలలో రైతులు బొప్పాయి మొక్కలను నర్సరీల నుంచి దిగుమతి చేసుకొని సాగు ప్రారంభించారు. ఈ ఈఏడాది జిల్లాలోని రైల్వేకోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి, పుల్లంపేట, పెనగలూరు, రాజంపేట, నందలూరు, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పీలేరుతో పాటు పలు మండలాల్లో 6500 ఎకరాలకు పైగా రైతులు బొప్పాయి సాగు చేస్తున్నారు. కోడూరు, చిట్వేలి, మదనపల్లి ప్రాంతాలలో పలు నర్సరీల్లో బొప్పాయి మొలకలకు గిరాకీ పెరిగింది. దీంతో బొప్పాయి నర్సరీల్లో పనులు పెరిగి పలువురు మహిళలకు ఉపాధి లభిస్తోంది. జిల్లాలో సుమారు 20 నర్సరీలకు పైగా ఉన్నాయి. కేవలం కోడూరు ప్రాంతంలోనే 15 నర్సరీల వరకు బొప్పాయి మొలకలను సరఫరా చేస్తున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు, గింజలు నర్సరీలో ఇచ్చి మొలకకు రూ. 3.50 వరకు చెల్లించి 45 రోజుల తర్వాత బొప్పాయి మొలకలను తీసుకెళ్లి భూమిలో నాటుతారు. ఒక్కొక్క నర్సరీలో 6లక్షల నుంచి 20లక్షల వరకు మొలకలు వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాలతోపాటు తమిళనాడు రాష్టానికి రైతులు తీసుకెళుతుంటారు. గత ఏడాది వర్షాలు పడడంతో జనవరిలో గిరాకీ పెరిగింది. ఒక ప్యాకెట్‌కు 70 శాతం నుంచి 80 శాతం మధ్య మొలకలు గింజలు మొలకెత్తుతాయి.

మూడు దశల్లో ఆదాయం..

బొప్పాయి పంటతో రైతులకు మూడు దశల్లో ఆదాయం వస్తుంది. ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు మొదటి రెండు కాపులు ఫలితాన్ని ఇస్తుంది. అలాగే మందుల తయారీ కర్మాగారాలకు బొప్పాయి పాలకు మంచి డిమాండ్ ఉంటుంది. బేకరీల్లో చర్రీ తయారీకి బొప్పాయి పంట పాలు తీశాక చివరిదశ కాయలను రైతులు అమ్ముకునే వీలుంటుంది.

అధికారుల పర్యవేక్షణ

బొప్పాయి నర్సరీలను అధికారులు పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు తగిన సలహాలు, సూచనలు అందజేస్తున్నారు. ముఖ్యంగా గింజల కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి గింజల ప్యాకెట్లపై ఉన్న హోలోగ్రామ్ ద్వారా బ్యాచ్ నెంబరు, తయారీ తేదీ, కొనుగోలు చేసిన రైతుల పేర్లు నర్సరీలలో రికార్డు చేసే విధంగా చర్యలు తీసుకొన్నారు.

కోటి ఆశలతో బొప్పాయి పండిస్తున్నాము



బొప్పాయి పంట సాగు చేసి గత ఏడాది పూర్తిగా దెబ్బతిన్నాము. ఈ ఏడాది పంటకు ధర బాగా ఉంటుందని ఆశతో సాగు చేస్తున్నాను. రెండేళ్ల నష్టాలు వస్తే ఒక్క సంవత్సరం మాత్రమే లాభాలు వస్తున్నాయి. పెరిగిన ఖర్చులతో పెట్టుబడి అధికమవుతూ ఉంది. పంట బాగా వచ్చి ధరలు పలికితే అప్పులు తీరుతాయి.

– గురవయ్య, బొప్పాయి రైతు, దేవసముద్రం, పుల్లంపేట మండలం

అధికారుల సూచనలు పాటిస్తున్నాం



రైతులు, వ్యాపారులు ఇచ్చిన బొప్పాయి గింజలను నాటే దశ నుంచి, ఎగుమతుల వరకు ఉద్యాన శాఖ అధికారులు చెప్పిన విధంగా సలహాలు పాటిస్తున్నాము. గింజలు విత్తిన తర్వాత బొప్పాయి మొలకలను జిల్లాలోనే కాకుండా ఇతర ప్రాంతాలకు కూడా పంపుతున్నాము.

–మల్లు సుధాకర్‌రెడ్డి, ఎంఎస్సార్ బొప్పాయి నర్సరీ, రాఘవరాజపురం, రైల్వేకోడూరు.

సస్య రక్షణ పాటించాలి



రైతులు నర్సరీలలో నాణ్యమైన మొక్కలు తీసుకొని సాగు నాటి నుంచి సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా పంట మార్పిడి చేసుకుంటే మంచిది. రైతులు మొలకలు తీసుకొనేటప్పుడు బిల్లులు తీసుకోవాలి. తద్వారా మొక్కలకు సమస్యలు వస్తే గింజలు ఏ కంపెనీ, ఏ బ్యాచ్, తయారీ తేదీ, పెంచిన నర్సరీలను గుర్తించి నష్ట నివారణ చేపట్టవచ్చు.

–రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానశాఖ అధికారి

- మందుల తయారీలో బొప్పాయి పాలు వినియోగం
- తోటల వద్ద పాలు కొనుగోలు చేస్తున్న కాంట్రాక్టర్లు
- పాలసేకరణకు నైపుణ్యం కలిగిన కూలీల వినియోగం
- ఎకరం బొప్పాయి తోటలో పాల ధర రూ. 20వేలు
- బొప్పాయి ఆకు టన్ను రూ. 15వేలు

బొప్పాయి పాలను క్యాన్లలో నింపిన దృశ్యం



బొప్పాయి తోటల్లో పాలసేకరణ చేస్తున్న కూలీలు



బొప్పాయి పాలు.. రైతుకు లాభాలు

గుర్రంకొండ: సాధారణంగా బొప్పాయి తోటలు అనగానే బొప్పాయి కాయలే గుర్తుకు వస్తాయి. అయితే అందులో మరో కోణం దాగి ఉంది. బొప్పాయి కాయలు తినడానికే కాకుండా బొప్పాయి పాలు, ఆకులు మందుల తయారీలో వినియోగిస్తున్నారు. ఇందుకోసం నైపుణ్యం కలిగిన కూలీలు తోటల వద్దనే మకాం వేసి మరీ పాలసేకరణ చేస్తున్నారు. కాంట్రాక్టర్లు నేరుగా తోటల వద్దకే వచ్చి వాటిని కొనుగోలు చేస్తున్నారు. బొప్పాయి పాల కోసం ఎకరం తోటకు రూ. 20వేలు, బొప్పాయి ఆకు కోసం ఎకరం తోటకు రూ.15వేలు కాంట్రాక్టర్లు చెల్లిస్తున్నారు.

ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు పాలసేకరణ

బొప్పాయి తోటల్లో చెట్ల నుంచి పాలసేకరణ ఉదయం 6 గంటల నుంచి పదిగంటల వరకు మాత్రమే చేస్తారు. ఆ తరువాత కూలీలకు ఎలాంటి పని ఉండదు. జిల్లాలోని రైల్వేకోడూరు నుంచి ఇందుకోసం ప్రత్యేకంగా కూలీలను తీసుకొస్తున్నారు. కూలీలు బొప్పాయి తోటల్లోనే గుడిసెలు వేసుకొని పాలసేకరణ పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఉంటారు. కూలీలందరూ ఉదయం ఆరు గంటల నుంచి పదిగంటల వరకు పాలసేకరణ చేస్తారు.

ఎకరానికి ఎనిమిది క్యాన్ల పాలసేకరణ

ఎకరం బొప్పాయి తోటలో కూలీలు ఎనిమిది క్యాన్ల వరకు పాలసేకరణ చేస్తారు. ఒక్కో కూలీ కనీసం రోజుకు ఒక క్యాన్ పాలు సేకరిస్తారు. ఒక క్యాన్ పాలు సేకరిస్తే కూలీలకు కాంట్రాక్టర్ రూ. 1500 చెల్లిస్తారు.

ప్రత్యేక పద్ధతుల్లో పాలసేకరణ

బొప్పాయి పాలసేకరణ ప్రత్యేక పద్ధతుల్లో సేకరిస్తుంటారు. ముళ్ల కంప లాంటి వస్తువుతో ముందుగా బొప్పాయి కాయలపై గాట్లు వేస్తారు. అనంతరం బొప్పాయిచెట్టు కింద చుట్టూ ప్లాస్టిక్ కవర్‌తో తయారు చేసిన ఓ జల్లెడలాంటి అట్టను ఉంచుతారు. బొప్పాయి కాయల్లో నుంచి కారే పాలన్నీ కింద ఉన్న ప్లాస్టిక్ సంచుల్లో పడతాయి. పాలు కింద పడిన కొద్దిసేపటికే అవి గడ్డగా మారిపోతాయి. పాలధార నిలిచిపోయిన తరువాత గడ్డగా మారిన పాలను ప్లాస్టిక్ క్యాన్లలో నింపుతారు.

మందుల తయారీలో వినియోగం

బొప్పాయి తోటల్లో సేకరించిన పాలను క్యాన్ల ద్వారా కాంట్రాక్టర్లు రైల్వే కోడూరులోని ఫ్యాక్టరీలకు చేరుస్తారు. అక్కడి నుంచి ఈ బొప్పాయి పాలను ట్యాంకర్ల ద్వారా కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తారు. సాధారణ అల్లోపతి మందులతో పాటు ఆయుర్వేద మందుల తయారీలో ఈ పాలను వినియోగిస్తుండడంతో మంచి డిమాండ్ ఉంది.

ఎకరం తోట రూ.20వేలు

పాలసేకరణ కోసం కాంట్రాక్టర్లు ఎకరం బొప్పాయి తోటలకు రూ. 20 వేలు వరకు చెల్లిస్తుంటారు. పాలసేకరణ పూర్తి అయిన తరువాత బొప్పాయి ఆకు ను కూడా కత్తిరించి టన్ను రూ. 15 వేలు చొప్పున విక్రయిస్తుంటారు. బొప్పాయి పాలతో పాటు ఆకు కూడా మందుల తయారీలో వినియోగిస్తుంటారు. దీంతో పాలతో పాటు ఆకుకు కూడా మంచి డిమాండ్ ఉంది. మిగిలిన కాయల్ని ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు.

రోజుకు ఒక క్యాన్ పాలు సేకరిస్తాం



బొప్పాయి తోటల్లో రోజుకు ఒక క్యాన్ పాలు సేకరిస్తాము. ఉదయం 6 గంటల నుంచి 10 వరకు మాత్రమే పాలసేకరణకు అనుకూల సమయం. ఒక క్యాన్‌కు కాంట్రాక్టర్ రూ. 1500 ఇస్తాడు. పదిమంది ఒక బృందంగా ఏర్పడి బొప్పాయి తోటల్లోనే గుడిసెలు వేసుకొని ఇక్కడే ఉండిపోతాం.

– శీను, రైల్వేకోడూరు

మందుల తయారీలో వాడతారు



బొప్పాయి పాలను మందులు తయారు చేసే ప్రక్రియలో భాగంగా వాడతారు. మేము బొప్పాయి తోటలను కాంట్రాక్ట్ తీసుకొని పాలను సేకరిస్తాము. బొప్పాయి పాలతో పాటు ఆకు కుడా మందుల తయారీలో వినియోగిస్తారు. చివరగా మిగిలిన కాయలు స్వీట్ చిప్స్ తయారీకి వాడతారు.

– సిద్ధార్థ, కాంట్రాక్టర్, రైల్వేకోడూరు

న్యూస్‌రీల్

కలెక్టరేట్ వద్ద 102 అడుగుల స్తంభంపై జాతీయ జెండా

రాయచోటి : రాయచోటిలో కలెక్టరేట్ ముఖద్వారం వద్ద 102 అడుగుల స్తంభంపైన జాతీయ జెండా ఏర్పాటుకు చురుగ్గా జరుగుతున్న పనులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు.

సోమశిల ఎస్‌డీసీగా కె.భాస్కర్

రాజంపేట: రాజంపేటలోని సోమశిల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.భాస్కర్‌ను నియమితులయ్యారు. ఈమేరకు గత నెల 30న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన సర్వే విభాగం నుంచి పదోన్నతిపై ఇక్కడి వస్తున్నారు. ఇప్పటి వరకు ఎస్‌డీసీ ఇన్‌చార్జిగా రాజంపేట ఆర్డీఓ కోదండరామిరెడ్డి వ్యవహరిస్తున్నారు.

పది పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

రామాపురం: పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలను, ఎంఈఓ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఎంఈఓ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, నాడు నేడు పనులపై సమీక్షించారు. అనంతరం అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేటగాళ్ల దాడిలో నెమలి మృతి



వేటగాళ్ల దాడిలో మృతి చెందిన నెమలి

వాల్మీకిపురం: వేటగాళ్ల దాడిలో ఓ నెమలి మృతి చెందిన సంఘటన గురువారం అన్నమయ్య జిల్లాలో చోటు చేసుకొంది. గొర్రెల కాపరుల సమాచారం మేరకు.. వాల్మీకిపురం పట్టణ సమీపంలోని గొల్లపల్లి రోడ్డులో గుర్తు తెలియని వేటగాళ్లు నెమళ్లపై దాడులు చేయడంతో ఒక నెమలి మృతిచెందింది. ఎవరో వస్తున్నట్లు అలికిడి కావడంతో దుండగులు నెమలిని వదిలి పరారయ్యారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఓటర్ల తుది జాబితా విడుదల

అన్నమయ్య జిల్లాలో 13,60,056 మంది ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
రాజంపేట	113022	117394	23	230439
కోడూరు	95400	97300	17	192717
రాయచోటి	121374	122676	25	244075
తంబళ్లపల్లె	106881	108204	11	215096
పీలేరు	112023	114604	8	226635
మదనపల్లె	122998	126717	57	249772

రాయచోటి : కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాల వారీగా ఓటర్ల తుదిజాబితాను గురువారం విడుదల చేసింది. అన్నమయ్య జిల్లాలో 13,60,056 మంది ఓటర్లు ఉన్నట్లు విడుదల చేసిన జాబితాలో ప్రకటించారు. వీటిలో పురుషులు 6,72,980, మహిళలు 6,86,935 మంది, ట్రాన్స్‌జెండర్స్ 141గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఓటర్ల జాబితాను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ప్రజలు తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవడానికి ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గాల ఓటర్ల జాబితా ఇలా ఉంది.

త్వరితగతిన భూసేకరణ

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: జిల్లాలో జాతీయ రహదారుల కోసం భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం అన్ని జిల్లాలలో జరుగుతున్న జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణపై ఆంధ్రప్రదేశ్ రవాణా రోడ్లు, భవనాలశాఖ ప్రభుత్వ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో మినీ వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్‌లను, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ స్థానిక అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి 656.50 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఇందులో 350.094 హెక్టార్ల ప్రభుత్వ, ప్రైవేటు భూమి అప్పగించారన్నారు. మిగిలిన భూమిని త్వరగా సేకరించాలని కలెక్టర్ సూచించారు.



రాష్ట్ర ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్ఓ సత్యనారాయణ

అలాగే యువతకు స్వయం ఉపాధి కోసం ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్, రిటైల్ ఔట్లెట్‌లు ప్రతి మండలంలో ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టర్లతో చీఫ్ సెక్రటరీ సమీక్ష

వెలగపూడి సచివాలయం నుంచి రెవెన్యూ, అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక, హౌసింగ్, విలేజ్, వార్డు సెక్రటేరియట్ గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి సమీక్షించారు. జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి ఐదు లక్షల ఇళ్లు పూర్తి కావాలన్నారు. రబీ సీజన్ ఈ క్రాప్ బుకింగ్ ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వందశాతం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షకు జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్ఓ సత్యనారాయణ, జిల్లా అధికారులు పాల్గొన్నారు

రెండు నెలల్లో క్రికెట్ స్టేడియం పూర్తి

అన్నమయ్య జిల్లా కేంద్రంలో రూ. 2 కోట్లతో నిర్మించే క్రికెట్ స్టేడియం స్థలాన్ని గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి పట్టణ సమీపంలోని నక్కలవాండ్లపల్లె వద్ద క్రికెట్ స్టేడియం అన్ని హంగులతో నిర్మిస్తామన్నారు. నిర్మాణ పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, తహసీల్దార్ రవిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీఎస్ కో–ఆర్డినేటర్ల నియామకం

కడప కార్పొరేషన్ : జగనన్న సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల కో–ఆర్డినేటర్లను వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. చల్లా మధుసూదన్‌రెడ్డి వైఎస్సార్ జిల్లాతో పాటు శ్రీసత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల సమన్వయకర్తగా.. పుత్తా శివశంకర్‌రెడ్డి అన్నమయ్య జిల్లాతో పాటు ఎస్‌ఆర్‌ఎస్‌పీ నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, ప్రకాశం జిల్లాల సమన్వయకర్తగా వ్యవహరిస్తారు.

ఆటలతో శారీరక, మానసిక వికాసం

కడప ఎడ్యుకేషన్: ఆటలతో విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం లభిస్తుందని జిల్లా స్టెప్ సీఈఓ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ సాయి గ్రేస్ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జిల్లా నోడల్ ఆఫీసర్, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో రీజినల్ స్థాయి బాలికల 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2022–23 అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, పాలిటెక్నిక్ ఆర్‌జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, ఆర్‌జేడీ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్యలు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. స్టెప్ సీఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుతోపాటు ఆటలను దినచర్యగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఓడీ రాఘవరెడ్డి, శ్రీనివాసరావు, సుధారాణి, దామోదరం, సుజాత పాల్గొన్నారు.

మొదటి రోజు 11 కళాశాలల నుంచి..


మొదటి రోజు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో కడప, అన్నమయ్య జిల్లాలోని 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 180 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరికి వాలీబాల్, టేబుల్ టెన్నిస్ సింగిల్ అండ్ డబుల్, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల పరుగుపందెం, షటిల్ పోటీలను నిర్వహించారు.

సౌమ్యనాథుడి గుడి.. రక్షణ కొరవడి..

- ఎర్రరాతితో ఆలయ నిర్మాణం
- దశలవారీగా కూలిపోతున్న రక్షణ గోడలు
- పరిరక్షించాలంటున్న భక్తులు



రాతిగోడలపై ఉన్న ఇటుకల కట్టడం కూలిన దృశ్యం



సౌమ్యనాథాలయం



ఇటీవల ఉత్తర గాలిగోపురం సమీపంలో కూలిన రక్షణ గోడలు

రాజంపేట: సాక్షాత్తు కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వరస్వామిని పోలిన మూలవిరాట్టు.. ఎర్ర రాతితో ఆలయ నిర్మాణం...అదే నందలూరు గ్రామంలోని సౌమ్యనాథాలయం.. చోళ, మట్లిరాజుల కళానైపుణ్యానికి అద్దం పట్టే ఈ కోవెలకు ఇప్పుడు రక్షణ కరువైంది. ఈ ఆలయానికి చుట్టూ ఉన్న ప్రాచీన ప్రహరీ కూలిపోతోంది. సౌమ్యనాథాలయం కట్టడాలు, ఆలయ నిర్మాణం కేంద్ర పురావస్తుశాఖ ఆధీనంలో ఎప్పటి నుంచో ఉన్నాయి. ప్రస్తుతం ఆలయ భద్రతపై అనేక అనుమానాలు పుట్టుకొస్తున్నాయి.

ఆలయ నిర్మాణం ఇలా..

విశాలమైన ప్రాంగణంలో, నాలుగు రాజగోపురాల మధ్య ఉన్న ఈ ఆలయం పది ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. ఈ ఆలయంలో 108 స్తంభాలుఉంటే , అన్నింటిపైన భాగవతం రచించి ఉండటం కనిపిస్తుంది. ఆ ఆలయం శిథిలమైపోగా 11వ శతాబ్దంలో కులోత్తుంగచోళుడు ఈ ఆలయ నిర్మాణానికి పూనుకున్నాడని , అలా పునఃప్రారంభమైన ఈ క్షేత్ర నిర్మాణంలో పాండ్య, కాకతీయ, విజయనగరాజులు సైతం పాల్గొన్నారని చరిత్ర చెబుతోంది.

ఎర్రరాతిని ఉపయోగించే రక్షణ గోడలు: ఎర్ర రాతిని ఉపయోగించే రక్షణ గోడలతో పాటు ఆలయ నిర్మాణం జరిగింది. దక్షిణ, ఉత్తర, తూర్పు గాలిగోపురాలను కలుపుతూ పెద్దఎత్తున రక్షణ గోడను నిర్మించారు. ప్రాచీన శిల్పులు రక్షణగోడలో కొంత భాగం పెద్దపెద్ద బండరాళ్లను ఉపయోగించారు. పైగాభాగంలో నాణ్యమైన సున్నపు ఇటుకలను అమర్చారు. ఆలయం కూడా ఈ ప్రహరీ మధ్యలో కనిపించకుండా కేవలం గర్భాలయం గోపురం కనిపించేదని పూర్వీకులు చెబుతున్నారు. ఇప్పుడు అంతర్భాగంలోని ఆలయం కనిపిస్తోంది. దీన్ని బట్టి రక్షణ గోడలు ఏ మేరకు ఎంతవరకు కూలిపోతూ వచ్చాయో ఇట్టే అవగతమవుతోంది.

ఇటుకలు ఉన్నంత వరకు కూలిపోతూ..

ఆలయం ప్రహరీ పూర్తిగా దెబ్బతినింది. మరి కొన్ని చోట్ల పై భాగంలో ఉన్న ఇటుకల నిర్మాణం కూలిపోవడంతో మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. ఆలయ రక్షణ గోడలను ఇంతవరకు ఎక్కడా కూడా పునరుద్ధరించిన దాఖలాలు కనపించడంలేదు. కేవలం గాలిగోపురాలకు మరమ్మతులు చేపట్టారు. ఆలయం చుట్టూ ఉన్న రక్షణ గోడలు బలహీనంగా కనిపిస్తున్నాయి.

కేంద్ర పురావస్తుశాఖ అధికారి ఏమంటున్నారంటే..

సౌమ్యనాథాలయ రక్షణగా ఉన్న ప్రహరీలో కూలిన కొంతభాగం పునరుద్ధరించాలంటూ నివేదిక పంపామని కేంద్రపురావస్తుశాఖ సీఏ (కన్జర్వేటర్ అసిస్టెంట్) అధికారి బాలకృష్ణారెడ్డి తెలిపారు.

సౌమ్యనాథాలయం నిర్మాణమే అపురూపం



జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో సౌమ్యనాథాలయం నిర్మాణమే అపురూపం. చోళులు, పాండ్య, కాకతీయ, విజయనగరాజులు నిర్మితం చేసిన ఆలయాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్ర పురావస్తుశాఖపై ఉంది.

–భూమన శంకర్‌రెడ్డి, సంఘసేవకుడు, నందలూరు

చోళుల కళావైభవానికి నిదర్శనం



చోళుల శిల్ప కళావైభవానికి నిదర్శనమే నందలూరు సౌమ్యనాథాలయం. ఆలయం పూర్తిగా ఎర్రరాయి, నాణ్యమైన ఇటుకలతో ప్రహరీ నిర్మించారు. ఆలయానికి ఉన్న రక్షణ గోడలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

–పసుపులేటి శంకర్, ఆధ్యాత్మికవేత్త, నందలూరు

నాటుకోళ్లు చోరీ

సంబేపల్లె : మండలంలోని దుద్యాల గ్రామంలో నాటుకోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు దేవేంద్ర తెలిపారు. పెద్దకోడివాండ్లపల్లెకు చెందిన దేవేంద్ర తన పొలం వద్ద షెడ్ వేసుకొని కోళ్లను పెంచుకొంటూ జీవనం సాగిస్తుండేవాడు. మంగళవారం రాత్రి అతను ఇంటికి వచ్చాడు. తిరిగి పొలం వద్దకు వెళ్లగా షెడ్‌లో ఉన్న 60 నాటుకోళ్లు కనిపించలేదు. ఈ మేరకు బుధవారం సంబేపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు దేవేంద్ర తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.50 వేలకు పైగా ఉంటుందని బాధితుడు చెప్పారు.

అన్న ప్రసాదం మెనూలో మార్పులు

ఒంటిమిట్ట (సిద్దవటం) : ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయంలోని అన్న ప్రసాదం మెనూలో మార్పులు చేస్తామని టీటీడీ సంయుక్త కార్యనిర్వహణాధికారి వి. వీరబ్రహ్మం గురువారం తెలిపారు. భక్తులకు పెరుగు అన్నం, సాంబారు అన్నం, పచ్చడి పెడుతుండటంతో కొంతమంది ఇష్టంగా తింటున్నారు. కొందరు ప్రైవేటు అన్నదాన కేంద్రాలకు వెళుతున్నారని, భక్తుల మనోభావాలకు అనుగుణంగా మెనూలో మార్పులు చేయనున్నట్లు జేఈవో తెలిపారు.

అగ్నిప్రమాదం.. ఆస్తినష్టం

బి.కోడూరు : వైఎస్సార్ జిల్లా గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి సుబ్బారెడ్డికి చెందిన బోదకొట్టం గురువారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగింది. బద్వేలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్(వైఎస్సార్ జిల్లా) : కడపనగరంలోని బహుజననగర్‌లో నివాసం ఉంటున్న నాగరాజు (45) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడపునొప్పి తాళలేక ఈ చర్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. అతని భార్యశ్రీదేవి కువైట్‌లో ఉంటోంది. కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటిలోనే పురుగుల మందు తాగాడు. కుమార్తె గమనించి 108 వాహన సిబ్బందికి ఫోన్ చేయగా వారు వచ్చి అప్పటికే మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడి సోదరుడు రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

విద్యార్థులకు అర్థమయ్యేలా వీడియో పాఠాలు



మాట్లాడుతున్న ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, శిక్షణకు హాజరైన అధ్యాపకులు

వైవీయూ : విద్యార్థులకు సరళంగా, సులువుగా అర్థమయ్యేలా వీడియో పాఠాలు రూపొందించాలని వైఎస్సార్ జిల్లా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్ పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలోని నోడల్ కేంద్రంలో వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల డిగ్రీ కళాశాల అధ్యాపకులకు ఇంటర్న్‌షిప్, వీడియో పాఠశాల రూపకల్పనపై శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ విద్యలో నూతన సంస్కరణలు ప్రారంభమైన నేపథ్యంలో వచ్చిన మార్పులకు తగిన విధంగా అధ్యాపకులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలని సూచించారు. నోడల్ రీసోర్స్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ పి. హరిప్రసాద్ మాట్లాడుతూ మూడురోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణలో ఉమ్మడి జిల్లాల పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు వీడియో పాఠాల రూపకల్పనపై శిక్షణ ఇస్తామని తెలిపారు. అనంతరం ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ చక్రవర్తి ఇంటర్న్‌షిప్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ డా. హరిబాబు, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

10న తలనీలాల వేలం పాట

సిద్దవటం : మండలంలోని శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి భక్తులు సమర్పించుకునే తలనీలాల పోగు హక్కు కోసం ఈనెల 10న ఉదయం 11 గంటలకువేలంపాట నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ కొండారెడ్డిలు తెలిపారు.గురువారం వారు మాట్లాడుతూ సిద్దవటంలోని రంగనాయక స్వామి ఆలయంలో వేలం పాట జరగుతుందన్నారు. మహా శివరాత్రి ఉత్సవాలు వచ్చేనెల 17 నుంచి 19 వరకు జరుగుతాయన్నారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనే పాట దారుడు ధరావత్తు కింద రూ.1,00,000 చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన వెంటనే హెచ్చు పాటదారుని ధరావత్తు తప్ప, మిగిలిన వారి ధరావత్తు రుసుం వెనక్కు ఇస్తామన్నారు. ఏకారణం తెలపకుండానే వేలం పాటను నిలుపుదల చేసేందుకు లేదా వాయిదా వేసేందుకు ఈఓకు అధికారం ఉందని తెలిపారు.

నోటి క్యాన్సర్‌ను గుర్తించే వెల్‌స్కోప్

కడపలోని దంతవైద్యశాలకు రూ. 7.50 లక్షల విలువైన పరికరం మంజూరు


వెల్‌స్కోప్ గురించి వివరిస్తున్న దంతవైద్యులు

కడప అర్బన్ : నోటిక్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేది వెల్‌స్కోప్ అని వైఎస్సార్ జిల్లా కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ అన్నారు. నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రామ్ (ఎన్‌ఓహెచ్‌పీఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ. 7.50 లక్షల విలువైన ఈ వెల్‌స్కోప్ పరికరాన్ని మంజూరు చేసిందని ప్రిన్సిపాల్ తెలిపారు. గురువారం ఈ పరికరాన్ని వినియోగించే విధానంపై దంతవైద్యులకు ఓరల్ మెడిసిన్, రేడియాలజీ విభాగం వారు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సురేఖ ప్రారంభించారు. ఈ పరికరాన్ని కడపలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు అందించేందుకు కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి(హెచ్‌ఎం అండ్ ఎఫ్ డబ్ల్యూ) జి.ఎస్. నవీన్‌కుమార్‌కు, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ జె. నివాస్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ వి. వినోద్‌కుమార్‌కు ప్రిన్సిపాల్, వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌ఓహెచ్‌పీ కో– ఆర్డినేటర్ డాక్టర్ ఐ. రమేష్ కుమార్, డాక్టర్ మెర్సీ, డాక్టర్ సురేష్ వెల్‌స్కోప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణకు 8 జిల్లాల నుంచి 85 మంది డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠినచర్యలు

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



రాయచోటి : సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడిపందేలు, పేకాట, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. గురువారం ఎస్పీ కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటనలో అసాంఘిక కార్యక్రమాల నిర్వహణపై ఎస్పీ తీవ్రస్థాయిలో స్పందించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో ఇప్పటికే పేకాట, కోడిపందేలు నిర్వహించే స్థావరాలను గుర్తించామన్నారు. ఆయా ప్రదేశాల్లో పోలీసు నిఘా ఉంటుందన్నారు. జిల్లావ్యాప్తంగా గతంలో కోడిపందేల్లో పాల్గొన్న వారిని గుర్తించి ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేసేలా చర్యలు చేపట్టామన్నారు. క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొన్న వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. పోలీసుల హెచ్చరికలను వీడి ప్రవర్తించిన వారిని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి చట్టపరమైన శిక్షలు విధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాల కారణంగా ఆర్థికంగా, నష్టపోతారని, తద్వారా కుటుంబ కలహాలు ఏర్పడతాయన్నారు. సులభంగా డబ్బులు సంపాదించడానికి, దొంగతనాలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వీటివల్ల పరోక్షంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

డిజిటల్ విద్యా విధానంతో ఉజ్వల భవిష్యత్తు


మాట్లాడుతున్న సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి. చిత్రంలో డీఈఓ దేవరాజు

కడప ఎడ్యుకేషన్ : డిజిటల్ విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి చెప్పలి దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని విద్యామందిర్ స్కూల్లో జిల్లాలో సీబీఎస్ఈ ఎంపిక చేసిన 31 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు శిక్షణా కార్యక్రమానికి డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానాన్ని అమలు పరచాలన్నారు. సీబీఎస్ఈ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అందువల్ల వాటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సివిల్ సర్వీస్, ఐఐటి వంటి ఉన్నతస్థాయి కోర్సుల్లో చేరేందుకు సీబీఎస్ఈ ఉత్తమ మార్గం అన్నారు. అనంతరం ఎస్‌సీఈఆర్టీ ద్వారా వచ్చిన రీసోర్సు పర్సన్స్ సాయికుమారి, రజనీచౌదరి, జిల్లా రిసోర్సు పర్సన్స్ ఆపర్ణరెడ్డి, జ్యోతిలు సీబీఎస్ఈ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి రామాంజనేయులరెడ్డి, జీసీడీవో ధనలక్ష్మి, కోర్సు కో–ఆర్డినేటర్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

బద్వేలు అర్బన్(వైఎస్సార్ జిల్లా) : తమ పిల్లలను నిష్కారణంగా కొట్టారంటూ గురువారం స్థానిక రజకవీధి ప్రాథమిక పాఠశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. వివరాలు..పాఠశాలకు సంబంధించి స్టేషనరీ మెటీరియల్ కనిపించలేదని బుధవారం పాఠశాలలోని ఇద్దరు ఉపాధ్యాయులు కొంతమంది విద్యార్థులను కొట్టినట్లు తెలిసింది. సాయంత్రం ఇంటికి వెళ్లిన విద్యార్థులు తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు గురువారం మధ్యాహ్నం సమయంలో పాఠశాల వద్దకు చేరుకు ని ఆందోళన చేశారు.పిల్లలను కొట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అయితే తాము పిల్లలను కొట్టలేదని, గట్టిగా మందలించామని, ఇకపై ఇలా జరగకుండా చూసుకుంటామని ఉపాధ్యాయులు సర్ది చెప్పడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు.

ప్రధానోపాధ్యాయుడి ఫిర్యాదు : పాఠశాలలోని ఓ విద్యార్థి తల్లిదండ్రులు తనపై దాడి చేశారని ప్రధానోపాధ్యాయుడు శేషఫణి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే విద్యార్థి తల్లిదండ్రులు ఆన్‌లైన్ విషయమై ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడామే గానీ దాడి చేయలేదని చెప్పుకొచ్చారు. రెండు ఘటనలతో పాఠశాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొంది.

తమ్ముడిని హత్య చేసిన అన్నకు జీవితఖైదు


పగడాల నరేష్

రాజంపేట : వరుసకు తమ్ముడైన పగడాల అశోక్‌కుమార్‌ను హత్య చేసిన కేసులో అన్న పగడాల నరేష్‌కు జీవిత ఖైదు విధిస్తూ రాజంపేట మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి మురళీకృష్ణ గురువారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిజాంజానీ అందించిన వివరాల మేరకు ...2016లో కడప నగరం చెమ్మమియాపేటకు చెందిన పగడాల అశోక్‌కుమార్ అదృశ్యమయ్యాడని అతని తల్లి వెంకటసుబ్బమ్మ ఫిర్యాదు చేసింది.ఈమేరకు కడప తాలుకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో తన పెద్దనాన్న కుమారుడు అశోక్‌కుమార్ దగ్గర డబ్బు ఉండి సాయపడలేదని కక్ష పెంచుకున్నాడు పగడాలనరేష్. మిత్రులు తిలక్, బంత్రోతు రాజశేఖర్ సహాయంతో తమ్ముడిని చంపేందుకు వ్యూహం రూపొందించారు. అతని డబ్బు, బ్యాంకు ఏటీఎం ద్వారా తీసుకోవాలని రాజంపేటలోని మహేంద్రఫైనాన్స్‌లో పనిచేస్తున్న తమ్ముడికి మాయమాటలు చెప్పి, పెనగలూరు మండలం ఇండ్లూరు గ్రామంలోని నదిలో గొంతుకోసి, ఇసుకలో పూడ్చివేశారు. అప్పట్లో ఈ సంఘటన సంచలనం కలిగించింది. ఈ కేసును రాజంపేట పోలీసులు దర్యాప్తు కొనసాగించారు. రాజంపేట మూడోఅదనపు జిల్లా కోర్టు లో విచారణ కొనసాగింది. నేరంలో ప్రథమ నిందితునిగా ఉన్న పగడాల నరేష్‌పైన హత్యకేసు రుజువైంది. దీంతో న్యాయమూర్తి మురళీకృష్ణ నరేష్‌కు జీవితఖైదు, రూ.7వేలు జరిమానా విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ నిజాంజానీ వాదించారు. సీఐ సదాశివయ్య, సీఐ మోహనకృష్ణ, సీఐలు అశోక్‌కుమార్ కేసు విచారణ చేపట్టారు.

ప్రజలకు మెరుగైన సేవలను అందించాలి


వల్లూరు గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా

వల్లూరు : ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేయాలని ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. వైఎస్సార్ జిల్లా వల్లూరు ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రణాళికలు, ప్రగతి గురించి తెలుసుకున్నారు. అంకిత భావంతో సమష్టిగా పని చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. అనంతరం వల్లూరు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. శాఖల వారీగా సిబ్బంది విధులు, బాధ్యతల గురించి తెలుసుకుని, పలు సూచనలు అందించారు. సచివాలయ ఉద్యోగులు తప్పని సరిగా డ్రస్ కోడ్ పాటించాలన్నారు. రికార్డులను తప్పని సరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈవో రమణారెడ్డి, ఎంపీడీవో జుబేద, తహశీల్దార్ నారాయణరెడ్డి, ఈవో పీఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడికి గాయాలు


గాయపడిన దైవసహాయం

మైదుకూరు (వైఎస్సార్ జిల్లా) : మైదుకూరు పట్టణ శివారులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దైవ సహాయం అనే ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. దువ్వూరు మండలం కానగూడూరు ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెడ్ టీచర్‌గా పనిచేస్తున్న ఈ అంధ ఉపాధ్యాయుడు ఉదయం తన సహాయకుడితో ద్విచక్రవాహనంపై పాఠశాలకు బయలుదేరాడు. మైదుకూరు శివారులోని శ్రీనగరం వద్ద జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీ కొనడంతో ఉపాధ్యాయుడు దైవ సహాయం ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందు వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న దువ్వూరు మండల సంగటి తిమ్మాయపల్లెకు చెందిన నాగశేఖర్‌రెడ్డి దంపతులకు స్వల్పగాయాలు కాగా ఉపాధ్యాయుని సహాకునికి ఎలాంటి గాయాలు కాలేదు. ఉపాధ్యాయుడు దైవసహాయాన్ని ప్రొద్దుటూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తీసుకెళ్లారు.

కారు ఢీకొని..


గాయపడిన జీవరత్నం

గోపవరం : వైఎస్సార్‌జిల్లా గోపవరం ప్రాజెక్టుకాలనీ వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే కాలనీకి చెందిన జీవరత్నంకు తీవ్ర గాయాలయ్యాయి. ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా బద్వేలు నుంచి నెల్లూరు వెళుతున్న కారు అతివేగంగా ఢీకొనడంతో జీవరత్నంకు కాలు, చేయి విరిగాయి. ప్రమాదానికి కారణమైన కారు ఆపకుండా వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన వ్యక్తిని బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెన్నానదికి నీరు విడుదల


పెన్నానదిలో ప్రవహిస్తున్న నీరు

జమ్మలమడుగు (వైఎస్సార్ జిల్లా) : గండికోట జలాశయం నుంచి మైలవరం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిని అధికారులు పెన్నానదిలోకి విడుదల చేశారు. గురువారం ఉదయం నుంచి గండికోట జలాశయం నుంచి ఆరువేల క్యూసెక్కులు వస్తోంది. దీంతో మైలవరం జలాశయం నుంచి మూడువేల 200 క్యూసెక్కులు పెన్నానదిలోకి విడుదల చేశారు. పెన్నానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- కాసులు కురిపించే డ్రాగన్‌ఫ్రూట్
- మార్కెట్‌లో గిట్టుబాటు ధర
- పండులో ఔషధగుణాలు మెండు


డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలు

ములకలచెరువు : కాసులు కురిపించే డ్రాగన్ ఫ్రూట్‌ను గుంటూరు జిల్లాకు చెందిన రైతులు ప్రదీప్, భాస్కర్‌రావు ప్రయోగాత్మకంగా పండించి విజయం సాధించారు. వీరిద్దరు ములకలచెరువు మండలంలోని ఏసువారిపల్లె సమీపంలో 20 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 12 ఎకరాల్లో పంటను పండించి మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

డ్రాగన్‌ఫ్రూట్ పంట ప్రారంభంలో ఎకరా విస్తీర్ణంలో సాగుచేయడానికి రూ. 5 లక్షలు ఖర్చుచేయాలి. ఒకటిన్నర సంవత్సరానికి పంట దిగుబడి వస్తుంది. తర్వాత ప్రతి ఏడాదికి రూ. 50 వేలు ఖర్చవుతుంది. మొదటిసారి దిగుబడి 2 నుంచి 4 టన్నులు వస్తుంది. రెండో ఏడాది 6 నుంచి 8 టన్నులకు పెరుగుతుంది. వైరస్ , పురుగుల బెడద ఉండదు. ఒక ఎకరాకు 2400 మొక్కలు, 600 స్తంభాలు అవసరం ఉంటుంది.

గిట్టుబాటు ధర

డ్రాగన్‌ఫ్రూట్ కిలో రూ.150 నుంచి రూ.200కు పైగా కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇక్కడి నుంచి డ్రాగన్‌ఫ్రూట్‌ను బెంగుళూరు, విజయవాడ, హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. హార్టికల్చర్ నుంచి ఎకరాకి హెక్టార్‌కు రూ. 30 వేలు సబ్సిడీ ఇస్తారు. ఒక హెక్టార్ సాగుచేస్తేనే సబ్సిడీ లభిస్తుంది. ఇక్కడ పింక్‌టు పింక్ రకం సాగు చేస్తున్నారు.

ఔషధగుణాలు ఎక్కువ..

చైనా అనగానే ఎర్రటి డ్రాగన్ బొమ్మ కనిపిస్తుంది. అది ఎర్రటి మంటలను కక్కుతుంది. ఈ డ్రాగన్ పేరుతో ఒక పండు ఉంది. అదే డ్రాగన్ ఫ్రూట్. విదేశాల్లో సంపన్నులు తినే ఈ పండు ఎక్కువగా మన ప్రాంతంలో కనిపించవు. ఈ పండు దక్షిణ అమెరికాలో పుట్టింది. ఈ మొక్కను తెలుగులో సిరి జమ్మడ మొక్క అంటారు. ఇది ఎడారి జాతికి చెందిన పండ్ల మొక్క. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ యాక్సిడెంట్లు, విటమిన్‌తో పాటు ఐరన్, మెగ్నీషియం, మినరల్స్ ఉంటాయి. ప్లేట్‌లెట్స్ పడిపోయిన సమయంలో ఈ పండు తింటే ఆరోగ్యంగా ఉంటారు. బరువు నియంత్రణ, అస్తమా, చెడు కొలెస్ట్రాల్ తగ్గడం, డైయాబిటీస్ లాం వ్యాధుల బారిన పడకుండా చేస్తుందని వైద్యులు చెప్తున్నారు.

అందరూ ఆసక్తి చూపుతున్నారు



గుంటూరు జిల్లాకు చెందిన రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంటసాగు విజయవంతం కావడంతో ఇక్కడి రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంటసాగుకు ఆసక్తి చూపుతున్నారు. పీటీఎం మండలం కాట్నగల్లు, ములకలచెరువు మండలంలో సోంపల్లిలో కొత్తగా పంటసాగు చేశారు. పంటపైన రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాము. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మన జిల్లా నేలలు, వాతావరణం అనుకూలం.

– ఎస్. ప్రతాప్‌రెడ్డి, హార్టికల్చర్ అధికారి, ములకలచెరువు